15 ఇసుక ట్రాక్టర్లు సీజ్

పాలకొండ: నాగావళి నదిలో మంగళాపురం గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి మంగళవారం సీజ్ చేశారు. ఈ గ్రామం పరిధిలో గల వంతెన సమీపంలో ప్రతిరోజూ వందలాది ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఎంపీడీవో విజయరంగారావు, ఎస్సై ప్రయోగ మూర్తిలతో కలిసి ఇసుక తవ్వకాల వద్దకు సబ్‌కలెక్టర్ వెళ్లి పరిశీలించారు.

15న జన్‌జాతీయ గౌరవ దివస్

పార్వతీపురంటౌన్: జన్ జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని ఈ నెల 15న ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం సెక్టోరల్ అధికారులతో సమీక్షించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించాలని సూచించారు. శాసన మండలి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున, నియమ నిబంధనలను పాటిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.

ఆపార్ నమోదులో నిర్లక్ష్యం తగదు: డీఈఓ

భామిని: విద్యార్థుల భవిష్యత్తుకు సరైన గుర్తింపునిచ్చే అపార్ నమోదులో నిర్లక్ష్యం తగదని, తగు జాగ్రత్తలు తీసుకుని పూర్తి వివరాలతో నమోదు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు విద్యాశాఖ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు భామిని మండల కేంద్రంలోని విద్యాలయాలన్నింటిని మంగళవారం ఆయన సందర్శించి టీచర్లు, విద్యార్థులతో మాట్లాడారు.

న్యూస్‌రీల్

డీవీఈఓకు గురుబ్రహ్మ స్టేట్ అవార్డు



అవార్డు అందుకున్న డీవీఈఓ మంజులవీణ, అధ్యాపకుడు తెర్లి రవికుమార్

పార్వతీపురం టౌన్: జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మంజులవీణ, పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు తెర్లి రవికుమార్‌లకు గురుబ్రహ్మ స్టేట్ అవార్డు 2024 వచ్చాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జె. రామారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మంగళవారం వారిద్దరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. వారు చేస్తున్న పలు సేవలను గుర్తించి మదర్ థెరిసా సోషల్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం వారు గురుబ్రహ్మ స్టేట్ అవార్డు 2024లను అందజేశారని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా తెలిపారు.

జొన్నలు ధ్వంసం



ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన జొన్నలు

కొమరాడ: మండల ప్రజలు, రైతులను గజరాజుల బాధలు వీడడం లేదు. డంగభద్ర గ్రామ సమీపంలో ఉన్న గజరాజుల గుంపు సోమవారం అర్ధరాత్రి కందివలస వరి పంటపొలాల్లో నుంచి కొత్తకంబవలస సమీపంలో ఉన్న గొర్లి సంగీతకు సంబంధించిన టార్పాలిన్లు కప్పి ఉంచిన సుమారు 10 క్వింటాళ్ల జొన్న పిక్కలు చిందరవందర చేసి ధ్వంసం చేశాయి. అనంతరం అలా నడుచుకుంటూ కుమ్మరిగుంట రహదారిపై నుంచి వెళ్లి ఆర్తాం కొండలపైకి వెళ్లాయి పగలంతా తిష్ట వేసి సాయంత్రం ఐదు గంటలు దాటిన తరువాత పంటపొల్లాల్లో సంచరించడంతో పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించే ఏర్పాట్లను అటవీశాఖ అధికారులు చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

సాలూరు రూరల్: మండలంలోని జనవరివలసలో గత ఏడాది జూలైలో 5 సెల్‌ఫోన్లు, రెండు వేల రూపాయల నగదు చోరీ చేసిన నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు. నిందితుడిని సీతంపేట మండలంలోని ఈతమానుగూడ గ్రామానికి చెందిన సమర సింహాచలంగా గుర్తించినట్లు చెప్పారు.

మాదకద్రవ్యాల నియంత్రణే మన 'సంకల్పం'

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి
- కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలు

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను యువతకు వివరించి, వాటి నియంత్రణే మన 'సంకల్పం' అని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమ ఉద్దేశాలను ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు మంగళవారం వివరించారు. కొన్ని డ్రగ్స్‌ను న్యాయబద్ధంగా తయారుచేస్తూ.. వైద్యంలో వినియోగిస్తుంటే.. మరి కొన్ని రకాల మత్తు కలిగించే గంజాయి, నల్లమందు పంటలను అక్రమంగా పండిస్తున్నార న్నారు. ఇటీవల కాలంలో పదివేల ఎకరాల్లో గంజాయి పంటను నాశనం చేసి 3 వేల మందిని అరెస్టు చేసినట్టు వెల్లడించారు. మాదక ద్రవ్యాల వినియోగమన్నది ప్రతి ఒక్కరి సమస్యగా భావించి కట్టడి చేయాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇతరులకు పంపడం నేరమన్నారు. డిజిటల్ అరెస్టు, డిజిటల్ కోర్టు, ట్రాయ్, పార్సిల్స్, ఫెడెక్స్ కొరియర్ పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని, అటువంటి కాల్స్‌కు ఎవరూ స్పందించవద్దన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణ అనేది సమాజానికి పెద్ద చాలెంజ్‌గా మారిందన్నారు. యువతలో చైతన్యం తీసుకువచ్చి, మాదక ద్రవ్యాలకు దూరం చేసేందుకు 'సంకల్పం' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల మాట్లాడుతూ యువత భవిష్యత్ కోసం పోలీస్ శాఖ చేపట్టిన 'సంకల్పం' చాలా గొప్పదన్నారు. అనంతరం డీఐజీ గోపీనాథ్ జట్టి వైద్యకళాశాలకు డ్రగ్స్‌పట్ల అవగాహన కలిగిన కళాశాలగా ధ్రువపరుస్తూ సర్టిఫికెట్‌ను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. కళాశాలలో డ్రాప్‌ఇన్ బాక్సును ప్రారంభించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ డాక్టర్ బి.వెంకటరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, ప్రభుత్వ సైక్రియాటిస్ట్ హెచ్ఓడీ డాక్టర్ మల్లిక, డీఎస్పీలు, సీఐలు, మెడికల్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పదవీకాంక్షకు పరాకాష్ట!

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో రఘురాజు దంపతుల విన్యాసాలు
- టీడీపీతో అంటకాగుతూనే వైఎస్సార్‌సీపీ ఇచ్చిన ఎమ్మెల్సీ కోసం రఘురాజు ఆరాటం
- శాసనమండలి ఛైర్మన్ వేటువేసినా తాను వైఎస్సార్‌సీపీలోనే ఉన్నానంటూ వాదనలు
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీగా కొనసాగుతూనే టీడీపీలో చేరిన రఘురాజు భార్య
- టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన నామినేటెడ్ పోస్టులో సుబ్బలక్ష్మి దర్జా
- తగిన బలం లేక ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు దూరంగా టీడీపీ కూటమి
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీల మద్దతుతో ఇండిపెండెంట్‌గా సుబ్బలక్ష్మి నామినేషన్



చిత్రంలో టీడీపీ కండువా వేసుకున్న ఆమె పేరు ఇందుకూరి సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాణి! గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తుపై ఎంపీటీసీగా గెలుపొందారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీల మద్దతుతోనే శృంగవరపు కోట వైస్ ఎంపీపీ పదవి కూడా పొందారు. ఆ పదవిలో కొనసాగుతూనే సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ నాయకుడు నారా లోకేశ్ ఆమెకు పసుపు కండువా వేసి పార్టీ తీర్థం ఇచ్చారు. టీడీపీ నేతలు గొంప కృష్ణ, కోళ్ల లలితకుమారి అందుకు సాక్షులు. ఎన్నికల్లో టీడీపీ కోసం లలితకుమారితో కలిసే సుబ్బలక్ష్మి ప్రచారం కూడా చేశారు. అందుకు ప్రతిఫలంగా టీడీపీ కూటమి ప్రభుత్వం ఆమెకు నామినేటెడ్ పోస్టు కూడా కట్టబెట్టింది. ఒకవైపు వైఎస్సార్‌సీపీ మద్దతుతో వచ్చిన వైస్ ఎంపీపీ పదవిలో కొనసాగుతూనే టీడీపీ కూటమి ప్రభుత్వంలో వచ్చిన నామినేటెడ్ పోస్టునూ అనుభవిస్తున్నారు.



టీడీపీ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఇటీవల దుశ్శాలువాతో ఇందుకూరి రఘురాజు ఇటీవల సన్మానిస్తున్న చిత్రం ఇది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దయతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి ఆయనకు దక్కింది. ఆ పదవిలో ఉంటూనే తెరవెనుక శృంగవరపుకోట నియోజకవర్గంలో టీడీపీ నేతలతో అంటకాగడం బహిరంగ రహస్యం. సార్వత్రిక ఎన్నికలకు ముందు కోళ్ల లలితకుమారి, గొంప కృష్ణ మధ్య అసెంబ్లీ టికెట్ పంచాయతీ కోసం టీడీపీ నాయకులతో కలిసి హైదరాబాద్ కూడా వెళ్లొచ్చారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోసం తెరవెనుక పని చేయడమూ వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ విప్ పాలవలస విక్రాంత్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు ఆయనపై వేటువేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కానీ రఘురాజు మాత్రం తానింకా వైఎస్సార్‌సీపీలో ఉన్నానంటూ ఎమ్మెల్సీ పదవి కోసం న్యాయపోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు.



ఇందుకూరి రఘురాజు ఒకవైపు వైఎస్సార్‌సీపీ ద్వారా పొందిన ఎమ్మెల్సీ పదవిని నిలబెట్టుకోవడానికి నానాపాట్లు పడుతుంటే ఇప్పుడు అదే ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఆయన భార్య ఇందుకూరి సుబ్బలక్ష్మి ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచారు. తగిన సంఖ్యాబలం లేదని గ్రహించిన అధికార టీడీపీ కూటమి ఈ ఎన్నికలకు పూర్తిగా దూరంగా ఉంది. కానీ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలిగా, ఆ పార్టీ ఇచ్చిన వైస్ ఎంపీపీ పదవిలో కొనసాగుతూనే అదే సమయంలో టీడీపీలో చేరి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ డైరెక్టర్ పోస్టునూ అనుభవిస్తూనే ఇప్పుడు ఎమ్మెల్సీ పదవి కోసం నామినేషన్లు వేయడం గమనార్హం. ఆ నామినేషన్ల పత్రాలపై ఆమెకు మద్దతుగా సంతకం చేసిన పది మందీ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులే. టీడీపీ ఎంపీటీసీలు ఒక్కరూ ఆమెకు మద్దతు ఇవ్వకపోవడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వైఎస్సార్‌సీపీకే రాజకీయ ద్రోహం చేసి, టీడీపీతో అంటకాగిన ఇందుకూరి రఘురాజు దంపతులు చివరకు ఎమ్మెల్సీ పదవి నానా విన్యాసాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీ చేయడానికి అవసరమైన సంఖ్యాబలం లేదని అధికార టీడీపీ కూటమి దూరంగా ఉంది. అదే సమయంలో తమ పార్టీ నాయకురాలైన ఇందుకూరి సుబ్బలక్ష్మిని బలపర్చలేదు. కనీసం ఆమె నామినేషన్‌పై ఏ ఒక్క టీడీపీ ఎంపీటీసీ సభ్యులు సంతకం కూడా చేయలేదు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులనే కొంతమందిని తమవైపునకు తిప్పుకొని సంతకాలు చేయించడం గమనార్హం. వాస్తవానికి ఇలాంటి రెండు పడవల వ్యవహారం వల్లే రఘురాజు సభ్యత్వంపై శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు వేటు వేయాల్సి వచ్చింది. తర్వాత న్యాయస్థానానికి వెళ్లి రఘురాజు కాస్త ఉపశమనం పొందినా స్థానిక సంస్థల కోటాలో విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక ప్రక్రియ మాత్రం ఆగలేదు. ఈ స్థానాన్ని భర్తీ చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే అన్నీ జరుగుతున్నాయి.

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్ ఇలా...

నామినేషన్ల ఉపసంహరణ గడువు	:	నవంబర్ 14
పోలింగ్	:	నవంబర్ 28 (ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ)
ఓట్ల లెక్కింపు	:	డిసెంబర్ 1
ఎన్నికల ప్రక్రియ పూర్తి	:	డిసెంబర్ 2

తిరుగులేని వైఎస్సార్‌సీపీ...

ఉమ్మడి విజయనగరం జిల్లాలో శాసనమండలి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నామినేషన్ అర్హత పొందింది. అధికార టీడీపీ కూటమి నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా రఘురాజు భార్య సుబ్బలక్ష్మి, ఆయన అనుచరుడు వెంకటరావు వేర్వేరుగా వేసిన నామినేషన్లు కూడా స్క్రూటినీలో నిలిచాయి. ఈనెల 14వ తేదీ వరకూ నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. ఆ తర్వాత కూడా ఉపసంహరణ లేకపోతే ఉప ఎన్నిక అనివార్యమవుతుంది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం నల్లేరుపై నడకే. మొత్తం 753 మందికి ఓటుహక్కు ఉండగా, వారిలో 592 మంది వైఎస్సార్‌సీపీ వారే. టీడీపీ బలం 122 కాగా, జనసేనకు ఒకటి మాత్రమే ఉంది. ఇండిపెండెంట్లు 15 మంది ఉన్నారు. మరణాల వల్ల 22 స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

బైక్‌పై నుంచి జారి వివాహిత మృతి



కాంతమ్మ మృతదేహం

కొమరాడ: మండలంలోని చిన ఖేర్జిల పంచాయతీ సర్వపాడు గ్రామానికి చెందిన కె.కాంతమ్మ(45)మోటార్ సైకిల్‌పై నుంచి జారిపడి మంగళవారం మృతి చెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, ఎస్సై నీలకంఠం చెప్పిన వివరాల ప్రకారం..సర్వపాడు గామం నుంచి మండల కేంద్రం కొమరాడకు గ్రామానికి చెందిన అల్లుడి వరుస వ్యక్తితో బైక్‌పై వచ్చిన ఆమె తిరుగు ప్రయణంలో కొమరాడ కొత్తవలస గ్రామ సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద జారి పడడంతో తలకు తీవ్రగాయాలపాలైంది. దీంతో వెంటనే ఆమెను పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించగా చిక్సిత పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

వీరఘట్టం: ఈనెల 10న గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన ఎచ్చెర్ల త్రినాథరావు(53) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. వీరఘట్టం మండలంలోని కుమ్మరిగుంట గ్రామానికి చెందిన త్రినాథరావు కొన్నేళ్లుగా లివర్, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడు. ఆ బాధను తట్టుకోలేక గడ్డి మందు తాగినట్లు మృతుడి పెద్ద కుమారుడు పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గిరిశిఖర గర్భిణుల వసతిగృహం సందర్శన



గర్భిణులతో మాట్లాడుతున్న వైద్యారోగ్యం, కుటుంబసంక్షేమశాఖ కమిషనర్ వి.కరుణ

సాలూరు: పట్టణంలోని వైటీసీలో గల గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని వైద్యారోగ్యం, కుటుంబసంక్షేమశాఖ కమిషనర్ వి.కరుణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో గర్భిణులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు తదితర అంశాలపై తెలుసుకున్నారు. జిల్లాలో సాలూరు, కురుపాం, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లో ఈ వసతిగృహాలు నిర్వహించ డంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అదనపు వసతిగృహాలపై ఆరా తీశారు. వసతిగృహాల్లో సమస్యలపై పలువురు విలేకరులు ఆమె దృష్టికి తీసుకురాగా, నిధులు అందుబాటులో ఉన్నాయని, సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా.విజయపార్వతి, నోడల్ అధికారి డా.ఎం.వినోద్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ అప్పారావు, పలువురు అధికారులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు భేష్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు భేషుగ్గా ఉందని, మరింత మెరుగైన సేవలు అందించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ తెలిపారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన నేపథ్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రితో పాటు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంసీహెచ్, ట్రైబల్ సెల్‌లో రోగుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి రిఫరల్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి కేసులు లేకపోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ట్రైఏజ్, లేబర్, ఎంఓటీ, ఆపరేషన్ థియేటర్, సర్జికల్, పిడియాట్రిక్, న్యూబోర్న్, మాతృ సంరక్షణ యూనిట్లను సందర్శించి పరిశీలించారు. పసిపాపను ఎత్తుకుని, ఆస్పత్రిలో అందుతున్న వసతులపై బాలింతలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి జిల్లా బాలల సంరక్షణ చికిత్స కేంద్రాన్ని సందర్శించి, అక్కడ వివిధ విభాగాలను తనిఖీ చేశారు. వివిధ లోపాలు గల చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని, ఇంకా మెరుగైన సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఇందుకు ప్రభుత్వపరంగా అందించాల్సిన పరికరాలు, సదుపాయాలు, వసతుల కల్పనకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ పర్యటనలో డీఎంహెచ్ఓ డా.కె.విజయపార్వతి, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా. ఎంవినోద్, ఏరియా, బాలల సత్వర చికిత్స ఆస్పత్రుల మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పీజీఆర్ఎస్ పర్యవేక్షణ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన ప్రతి అర్జీని పక్కాగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక, గృహ నిర్మాణ సంస్థ ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు.

పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని తద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అర్జీని సక్రమంగా పరిశీలించకుండా సరైన సమాచారం ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. గతంలో గృహ నిర్మాణ పథకం కింద మంజూరు చేసిన గృహాల గడువు త్వరలో ముగుస్తుందని, లబ్ధిదారులు త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఆయన కోరారు.

14న 'నీటి' సంఘాల ఎన్నికల శిక్షణ

నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలలో నియమితులైన అధికారులు, సిబ్బందికి ఈనెల 14వ తేదీన శిక్షణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితా ఇప్పటికే పంపించామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ. ప్రభాకరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి జి. రవి, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి. కరుణాకర్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, విద్యాశాఖ ఎ.డి ఎంఈ.రమాజ్యోతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై. సత్యంనాయుడు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'బెల్ట్' తీయండి

- ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌బీవీఎన్.బాబ్జీరావు



విజయనగరం, మన్యం జిల్లాల అధికారులతో సమీక్షిస్తున్న ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు

విజయనగరం క్రైమ్: మద్యం బెల్ట్ షాపులు నిర్వహించినా, వాటి నిర్వహణకు వేలంపాటలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు సబంధిత అధికారులకు సూచించారు. విజయనగరం బ్యాంక్ కాలనీలో ఉన్న కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎక్సైజ్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, ఎక్సైజ్ అధికారి బమ్మిడి శ్రీనాథుడు, డిపో మేనేజర్ గౌరీశ్వరరావు, రెండు జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక ఏకాదశి పూజలు



దీపదానం చేస్తున్న భక్తులు

పార్వతీపురంటౌన్: కార్తీకమాసంలో శుద్ధ ఏకాదశి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం సత్యనారాయణ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునుంచే బారులు తీరి స్వామివార్లను దర్శించుకున్నారు. కార్తీక దీపాలను వెలిగించి దీపదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బెలగాం పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయం, మండలంలోని పలు గ్రామాల్లో గల రామాలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతం చేశారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ వేంకటేశ్వర స్వామి



పూజలందుకుంటున్న సత్యనారాయణస్వామి



క్యూలో బారులు తీరిన భక్తులు